
సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం ၊ 25 ၊ డిసెంబర్ ၊ 2024



కడప కేథడ్రిల్ చర్చిలో పశువుల పాకలో బాల యేసు

ఇది శుభోదయం..

కడప కల్చరల్: అరాచక పాలన జరుగుతున్న సమయంలో దేవుడు తన కుమారుడు, కరుణామయుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి పంపాడని, ఆయన లోకంలోని పాపుల రక్షణకై తన జీవితాన్ని అర్పించారని క్రైస్తవ గురువులు అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి కడప క్యాథడ్రల్ చర్చిలో క్రీస్తు ఉదయించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థన సభ నిర్వహించారు. గురువులు క్రీస్తు జననం గురించి మానవాళికి మహోపకారిగా మారిన విధానం గురించి బైబిల్ సూక్తులను ఉదహరిస్తూ ప్రసంగించారు. అనంతరం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోయర్ బృందాలు స్తుతి గీతాలు ఆలపించాయి. తొలుత చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల పాకలో పాదర్లు, సంఘ పెద్దలతో కలిసి గురువులు బాల యేసును ఉంచి ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు ప్రార్థనలకు హాజరయ్యారు.



రక్షకుడు ఉదయించాడు..
ప్రపంచ మానవాళి అశాంతితో
బాధపడుతున్న వేళ..
శాంతి సమాధానాలిచ్చేందుకు
ఆయన అరుదెంచాడు..
పాపులను కరుణించే రక్షకుడిగా
పశువుల పాకలో జన్మించాడు..
ప్రేమ, శాంతి, కరుణలను
ఇంటింటా కాంతి దీపాలుగా వెలిగించాడు..
ఆ త్యాగమూర్తి రాకను లోకం
పరవశంతో స్వాగతిస్తోంది..
నేడు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా
జిల్లా అంతా పండుగ
వాతావరణం నెలకొంది.

రక్షకుడు ఉదయించాడు

- నేడు క్రిస్మస్ పర్వదినం
- చర్చిల్లో మొదలైన ప్రార్థనలు





సాక్షి, రాయచోటి: మెత్తగా కురుస్తున్న మంచు...ఆహ్లాదకరమైన వాతావరణం...మంద్రంగా చర్చి గంటల శబ్దాలు. ఏసయ్య రాకడను తెలుపుతూ ఇంటింటా వెలుగుతున్న క్రిస్మస్ స్టార్లు....పిల్లలకు క్రిస్మస్ తాతలు బహుమతులు ఇస్తున్న దృశ్యాలు...మనసంతా క్రీస్తుపై నిలిపి విశ్వాసులు చేస్తున్న ప్రార్థనలు..నోరూరించే కేకులు... వెరసి విశ్వాసుల్లో ఆనందం. మనసు నిండా ఉత్సాహం. బుధవారం అర్ధ రాత్రే పలు చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

తళుక్కుమన్న కాంతులు..

క్రిస్మస్ పర్వదినాన్ని నిర్వహించుకునేందుకు క్రైస్తవ లోకం సిద్ధమైంది. దాదాపు పదిరోజుల ముందు నుంచే పండుగ హడావుడి ప్రారంభమైంది. చర్చిలను నూతన రంగులతో అందంగా రూపుదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలు అలంకరించారు. క్రీస్తు జననాన్ని గుర్తు చేసుకుంటూ రంగు రంగుల కాంతులు చిమ్మే క్రిస్మస్ స్టార్లను వెలిగించారు. మదనపల్లెలోని జేసీఎం చర్చి, తిరుపతిరోడ్డులోని సెయింట్‌లూక్ చర్చి, బెంగళూరురోడ్డులోని ఆరోగ్యమాత చర్చి, రైల్వేకోడూరులోని సెయింట్ లూథరన్ చర్చి, పీలేరులోని స్టీన్‌పాల్స్ చర్చితో పాటు జిల్లాలోని తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, సుండుపల్లె, ఓబులవారిపల్లె, చిట్వేలి తదితర ప్రాంతాల్లోని ప్రముఖ చర్చిల్లోనూ క్రిస్మస్ పండుగ నిర్వహణకు సిద్ధంగా ఉన్నాయి.



కాంతులీనుతున్న మదనపల్లె జేసీఎం చర్చి

ఆనందంగా.. ఆత్మీయంగా!

- కుటుంబికులు, బంధువులతో కలివిడిగా మాజీ సీఎం వైఎస్ జగన్
- ఇడుపులపాయలోని ఓపెన్ చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- అంతకుముందు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించిన మాజీ సీఎం
- ప్రజల కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటూ.. అడిగిన వారికి సెల్ఫీ ఇస్తూ..
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కార్పొరేటర్లతో ఇష్టాగోష్టి
- వేంపల్లెలో నూతన జంటకు ఆశీర్వాదం
- పులివెందులకు వెళ్లే దారి పొడవునా రాత్రి సమయంలోనూ ప్రజల పలకరింపు



ఇడుపులపాయలోని ఓపెన్ ఎయిర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు

ముందస్తు ప్రార్థనలు

ఇడుపులపాయలోని ఓపెన్ ఎయిర్ చర్చిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రిస్మస్ ముందస్తు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తల్లి వైఎస్ విజయమ్మతోపాటు సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుమార్తెలు హర్ష, వర్ష అలాగే దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, కుమారులు వైఎస్ అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వైఎస్ జగన్ చిన్నాన్న వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్ ఆనంద్‌రెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వైఎస్ జోసెఫ్ రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, సోదరులు, వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, యువరాజ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

సాక్షి కడప: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి రోజు జిల్లా పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. అనునిత్యం ప్రజలతో.. ప్రజా సమస్యలతో తీరికలేకుండా గడిపే జననేత వైఎస్ జగన్ క్రిస్మస్ పండుగ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలివిడిగా తిరిగారు. సరదాగా బంధువులతో నవ్వుతూ, నవ్విస్తూ ఆనందంగా కనిపించారు. ప్రతి ఏడాది క్రిస్మస్ పండుగకు ముందురోజు ఇడుపులపాయలోని ఓపెన్ చర్చి ప్రాంగణంలో కుటుంబ సభ్యులతోపాటు బంధువులందరూ కలవడం పెద్దల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఏటా క్రమం తప్పకుండా ఇక్కడ అందరూ కలిసి క్రిస్మస్ ముందస్తు ప్రార్థనలు నిర్వహిస్తారు. మంగళవారం చుట్టూ ప్రకృతి రమణీయతను పంచుతున్న కొండలు...ఆహ్లాదాన్ని పంచే వాతావరణం.. పచ్చని చెట్ల మధ్యన కుటుంబ సభ్యులందరూ కలిసిన క్రిస్మస్ పండుగ వేళ..ఆద్యంతం చిరునవ్వుల నడుమ.. ఒకరినొకరు పలుకరింపులు.. క్రిస్మస్ శుభాకాంక్షలు ఆత్మీయంగా గడిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ కుటుంబీకులతోపాటు బంధువులందరూ శుభాకాంక్షలు తెలియజేస్తుండగా ఆయన కూడా అందరితో కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తల్లి వైఎస్ విజయమ్మ కుమారుడు వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడగా, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ జగన్‌ను దగ్గరికి తీసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయకు చేరుకోగానే నేరుగా వైఎస్సార్ సమాధి ఘాట్ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో మమేకం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నేతలతోపాటు ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు ఇడుపుల పాయలో కలిశారు. ఇడుపులపాయలోని సమాధి ఘాట్ ప్రాంతంతోపాటు గెస్ట్‌హౌస్ వద్ద మాజీ ముఖ్యమంత్రిని కలిశారు. ఇక కడపకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మాజీ సీఎంను కలిసి చర్చించారు. కడప అభివృద్ధితోపాటు పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడుకున్నారు. అనంతరం ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌తో ఫొటోలు తీసుకున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాజీ సీఎం పక్కనే ఉంటూ ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి నాయకులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సింగారెడ్డి సతీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సుధీర్‌రెడ్డి, బిజేంద్రనాథరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, డీసీ గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కడప నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు బండి నిత్యానందరెడ్డి, ముంతాజ్‌బేగం, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు నాగిరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి అధినేతను కలిసిన వారిలో ఉన్నారు.



వేంపల్లెలో వివాహ వేడుకలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

అడుగడుగునా ఆత్మీయత

ఇడుపులపాయ నుంచి వేంపల్లెకు వెళుతుండగా దారి మధ్యలో జనాలు జననేతను పలకరించారు. వేంపల్లెలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో వేముల మండలానికి చెందిన వెన్నపూస వెంకట్రామిరెడ్డి కుమారుడు వివాహానికి వైఎస్ జగన్ హాజరయ్యారు. వధూవరులు పురుషోత్తంరెడ్డి, సాహితీరెడ్డిలను ఆశీర్వదించారు. అనంతరం అక్కడి మహిళలతో మాట్లాడారు.అనంతరం వేంపల్లె నుంచి పులివెందులకు వెళుతున్న వైఎస్ జగన్‌ను దారి మధ్యలో రాత్రిని కూడా లెక్క చేయకుండా జనాలు పలకరించారు.



నాన్నకు ప్రేమతో....

అక్కడ అడుగుపెడుతూనే
ఆయన కళ్లు చెమ్మగిల్లాయి..
అక్కడికి రాగానే
భావోద్వేగాలేవో కదలాడాయి..
తెలియకుండానే ఓ చేయి
తన గుండెలపై చేరింది..
మరో చేయి సమాధిని తాకింది...
మనిషిలో మౌనం..
మనసులో ధ్యానం రాజ్యమేలింది..
వైఎస్ఆర్ ఘాట్‌లో మహానేత వైఎస్సార్‌కు
నివాళి అర్పించిన క్షణంలో
జననేత వైఎస్ జగన్‌లో కనిపించిన భావాలివి.
అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా..
కోట్లాదిమంది ప్రేమా.. ఆప్యాయతలు
తనకందించిన నాన్నను
మనసారా స్మరించుకున్నారు..



కొండంత భరోసా...

నాయకుడంటే ముందుకు నడిపించాలి..
తనే కొండంత ధైర్యమివ్వాలి..
నాయకుడంటే ఓ భరోసా ఇవ్వాలి..
ఆపత్కాలంలో తనే ఓ భద్రత కావాలి.. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పుడదే చేసి చూపించారు.
కడప కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో వారికి ధైర్యమిచ్చారు. ఏ సమస్య వచ్చినా కలవండంటూ తమ్ముడు అవినాష్‌ను చూపిస్తూ కొండంత భరోసా ఇచ్చారు.



అభిమాన సంద్రం...

అభిమాన నాయకుడిని చూసిన ఆ క్షణం కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేసింది.. నలువైపులా తరలివచ్చిన అభిమాన సంద్రంతో ఆ ప్రాంతం హోరెత్తింది. నాలుగు రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌పై అభిమానం వెల్లువలా కురిసింది. అభిమానులు, నేతలు, కార్యకర్తలు చూపించిన అభిమాన సంద్రంలో అధినేత తడిసి ముద్దయ్యారు. మరోవైపు చిరు జల్లులూ ఆయన్ను చల్లగా స్వాగతించడం విశేషం.

నేటి పర్యటన వివరాలు

పులివెందుల రూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం పులివెందుల, లింగాల మండలాల్లో పర్యటించనున్నారు. క్రిస్మస్ సందర్భంగా పులివెందుల సీఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

- లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో మధ్యాహ్నం 2.30 గంటలకు రామాలయాన్ని ప్రారంభిస్తారని ఎంపీ అవినాష్ రెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

మంత్రి మండిపల్లి క్రిస్మస్ శుభాకాంక్షలు



రాయచోటి టౌన్: క్రిస్మస్ వేడుకలు అందరూ సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన ద్వారా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలను ఆచరించాలన్నారు. ౧.

కలెక్టర్ శుభాకాంక్షలు: జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, శాంతికి చిహ్నంగా క్రిస్మస్ పండుగ జరుపుకుంటారన్నారు.

జిల్లా ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు



మేడా రఘునాథరెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి, ఆకేపాటి

రాజంపేట: జిల్లా ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వమానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు పంచిన కరుణామయుడు , ప్రేమమూర్తి ఏసుక్రీస్తు అన్నారు. ఈ క్రిస్మస్ ప్రజలందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని ప్రతి ఇంట ఆనందపు కాంతులు వెదజల్లాలని ఆకాంక్షించారు.

పీబీసీ లైనింగ్‌లో దోపిడీకి స్కెచ్!

- కాకి లెక్కలతో రూ.480.22 కోట్ల పని అప్పగింత ఉత్తర్వు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పీబీసీ వెడల్పు పనుల
- నిధులు రూ.1,929 కోట్లు మిగిలాయట
- ఈ పని రద్దు చేయకనే అదే కాంట్రాక్టు సంస్థకు నామినేషన్‌పై పనులు అప్పగించేసిన ప్రభుత్వం



లైనింగ్ పనులు చేపట్టాల్సిన పుంగనూరు ఉపకాలువ

బి.కొత్తకోట: ఏవీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండోదశలో భాగమైన పుంగనూరు ఉప కాలువ లైనింగ్ పనులను ప్రభుత్వం టెండర్ లేకుండా అప్పనంగా అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి సీఈ పంపిన ప్రతిపాదన నివేదిక మేరకు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో సాగే పుంగనూరు ఉప కాలువకు కిలోమీటర్ 75.00 నుంచి కిలోమీటర్ 189.00 వరకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపి రూ.480.22 కోట్ల పనిని నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెడుతూ ఉత్తర్వు జారీ చేసింది. అసలు ఈ జీఓ జారీ, పనుల అప్పగింత, నిధుల కేటాయింపు, ఏ పని ఎంత చేయాలి, డిజైన్, పని స్వరూపం తదితర వాటికి సంబంధించి స్పష్టత లేకనే పనులకు అనుమతి ఇవ్వడంపై నీటి పారుదల రంగ నిపుణులు విస్తుపోతున్నారు.

పని చేయకనే నిధుల మిగులా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణ కార్యక్రమంలో భాగంగా పుంగనూరు ఉపకాలువను వెడల్పు చేసి గండికోట రిజర్వాయర్ నుంచి 800 క్యూసెక్కుల కృష్ణా జలాలను అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు తరలించాలని నిర్ణయించింది. ఈ పనులకు రూ.1,929 కోట్లు మంజూరు చేయగా హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ 1,217 కోట్లకు పనులు దక్కించుకుని ఒప్పందం చేసుకుంది. కంపెనీ కొంతమేర పనులు చేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 25శాతం లోపు పనులను రద్దు చేసుకుంది. దీంతో ఈ పని కూడా రద్దయినట్టే. అయితే పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనికి రూ.485.10 కోట్లు మంజూరు చేయాలని తిరుపతి సీఈ నివేదిక మేరకు రూ.480.22 కోట్లకు మంజూరు చేస్తున్నట్టు జీఓలో పేర్కొన్నారు. కాగా గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1,929 కోట్లు మిగిలాయని, ఆ నిధుల్లో రూ.480.22 కోట్లు ఖర్చు చేయనున్నట్టు పేర్కొన్నారు.

కుప్పం కోసమే పెంపు

పుంగనూరు ఉప కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం 145 క్యూసెక్కులు ఉంటే కుప్పం నియోజకవర్గం కోసం కిలోమీటర్ 189.800 నుంచి కిలోమీటర్ 207.800 వరకు కాలువను వెడల్పు చేస్తారు. ఇక్కడి నుంచి నీటి ప్రవాహ వేగం 282 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

సాక్షి ముందే చెప్పింది

పుంగనూరు ఉప కాలువ పనిని ప్రభుత్వం టెండర్లు లేకుండా నామినేషన్‌పై కట్టబెట్టేలా చూస్తోందని సాక్షి దినపత్రికలో ఈనెల 8న టెండర్లా.. నామినేషనా అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది.

కాంట్రాక్టర్‌కు దోచి పెట్టాలనే..

పీబీసీ వెడల్పు పనులను రద్దు చేయని ప్రభుత్వం అదే పని నిధులు మిగులుగా చూపిస్తూ.. ఈ మిగులు నిధులతో పుంగనూరు ఉప కాలువ లైనింగ్ పనులు చేపడుతున్నట్టు జీఓలో ప్రభుత్వం చెప్పడం చూస్తే అంతా అవినీతి కథలా కనిపిస్తోంది. టెండర్ల నిర్వహణ లేకుండా నామినేషన్‌పై నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కాలువ వెడల్పు పనుల ఒప్పందం మేరకు అంటూ అప్పగించేసింది. కాంట్రాక్టర్ ఇష్టమొచ్చినట్టు పనులు చేసుకునేలా, ఇష్టమొచ్చినంత బిల్లులు పెట్టుకుని దోచుకునేలా ఈ జీఓ ఉందని నీటిపారుదల రంగ నిపుణులు అంటున్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



బిడ్డను బంధువులకు అందిస్తున్న సిబ్బంది

నిమ్మనపల్లె : పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలించే క్రమంలో 108లో ప్రసవించిన ఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని రెడ్డివారిపల్లె సమీపంలోని పౌల్ట్రీఫారమ్‌లో బీహార్‌కు చెందిన హసన్, ఖాతూన్ దంపతులు పని చేస్తున్నారు. ఖాతూన్‌కు నెలలు నిండి ప్రసవ సమయం దగ్గర పడటంతో... మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో నొప్పులు అధికం కావడంతో 108కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న పైలట్ ఏ.ఎస్.సద్దాం, ఈఎంటీ రెడ్డిజస్వంత్‌తో కలిసి రెడ్డివారిపల్లెకు చేరుకుని మహిళతోపాటు ఆమె బంధువులను 108లోకి ఎక్కించుకుని నిమ్మనపల్లె పీహెచ్‌సీకి బయలుదేరారు. అయితే మార్గంమధ్యలో మహిళకు నొప్పులు అధికమవడంతో 108 వాహనంలోనే ఖాతూన్ పండంటి ఆడబిడ్డను ప్రసవించింది. 108 సిబ్బంది ఆమెకు సేవలు అందించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

నిమ్మనపల్లె : వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ నెల 22న రెడ్డివారిపల్లె పంచాయతీ దిగువమీద జంగంపల్లికి చెందిన రమణయ్య కుమారుడు టి.అశోక్ (34) మదనపల్లెలో శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. అదే గ్రామానికి చెందిన రామానాయుడు కుమారుడు రమేష్ ఎదురుగా ద్విచక్ర వాహనంలో వచ్చాడు. ఉద్దేశపూర్వకంగానే ఢీకొనేందుకు ప్రయత్నించగా అశోక్ తప్పించుకున్నాడు. ఈ విషయమై రమేష్‌తో వాగ్వాదానికి దిగాడు. అనంతరం అదే రోజు సాయంత్రం ఈ విషయమై రమేష్ తన తండ్రి రామానాయుడు తల్లి అలివేలమ్మ కలిసి, అశోక్ ఇంటి వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. అశోక్ వారిని ఎదిరించడంతో పక్కనే ఉన్న కర్ర తీసుకొని రామానాయుడు, రమేష్ దాడి చేశారు. దాడిలో గాయపడిన అశోక్‌ని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్సల అనంతరం మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి

రాజంపేట రూరల్ : టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ పరిధిలో కృషి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ ఆదేశించారు. పట్టణంలోని ఈగిపాళెం అర్బన్ సెంటర్‌లో మంగళవారం ఆకేపాడు, నందలూరు, పెనగలూరు పీహెచ్‌సీల కమ్యూనిటీ హెల్త్ అధికారులతో ఆమె టీబీ, లెప్రసీ వ్యాధులపైన సమీక్ష నిర్వహించారు. టీబీ వ్యాధి గ్రస్తుల ఇంటి వద్దకు వెళ్లి విజిట్ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వ్యాధిగ్రస్తుల గృహస్తులకి టీబీ ప్రివెంటివ్ థెరఫీ ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ పంచాయతీ రిపోర్ట్సని తనిఖీ చేశారు. లెప్రసీ ఇంటింటి సర్వే ఏ విధంగా చేస్తున్నారో తెలియజేసే రిపోర్ట్స్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానె శేఖర్, వైద్యులు ఎస్. అశ్వినిచంద్ర, అశోక్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు చెన్నారెడ్డి, సుబ్బయ్య, యూడీసీ య.సిద్దిరామయ్య, టీబీ సూపర్ వైజర్‌లు పి.జయప్రకాష్, మల్లికార్జున, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల వాహనంపై

కూటమి శ్రేణుల దాడి

- పగిలిన బొలెరో అద్దాలు
- మండల మీట్‌కు వెళ్లకుండా అడ్డగింత
- చంపుతామని బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు





ప్రజాప్రతినిధులు వస్తున్న కార్లను అడ్డుకున్న కూటమి శ్రేణులు



కార్యాలయంలోకి వెళ్లేందుకు దూసుకొస్తున్న కూటమి శ్రేణులను నిలువరిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) పగిలిన బొలెరో కారు అద్దం

బి.కొత్తకోట/పెద్దతిప్పసముద్రం : హైకోర్టు ఆదేశాలతో మంగళవారం పెద్దతిప్పసముద్రం మండలమీట్ నిర్వహిస్తుండగా.. హాజరయ్యేందుకు వాహనంలో వెళ్తున్న తమపై కూటమి పార్టీలకు చెందిన నాయకులు దాడి చేసి చంపడానికి ప్రయత్నించారని ఎంపీటీసీ సభ్యులు పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. మండల మీట్‌ను అడ్డుకునేందుకు కూటమి శ్రేణులు ప్రయత్నించి ఉద్రిక్తత్త పరిస్థితులను సృష్టించారు. ఇద్దరు ఎంపీటీసీలను కారులో నుంచి బయటకు లాగేశారు. అప్రమత్తమైన పోలీసులు అడ్డుకున్నారు. ఎంపీటీసీలను లోపలికి పంపారు. ఈ వివరాల్లోకి వెళ్తే... మండలమీట్ సాగకుండా ఉదయం 10 గంటల వరకు కార్యాలయం తలుపులు, గేట్లు తెరవరాదని కూటమి నేతలు అధికారులకు ముందుగానే హెచ్చరించారు. ఎంపీటీసీ సభ్యులు వచ్చిన వెంటనే తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే.. తాము పోలీసు భద్రత కల్పిస్తామని ఎస్‌ఐ రవికుమార్ తెలియజేశారు. తర్వాత 10:30 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు ఎంపీపీ, ఎంపీటీసీలు బి.కొత్తకోటరోడ్డులోని కల్యాణ మండపం నుంచి ఒకేసారి రెండు కార్లలో బయలుదేరారు. ఒక కారులో ఎంపీపీ పి.మొహమూద్, ఎంపీటీసీలు పటవిక శోభ, కార్యచంద్ర, ఎస్.పద్మావతమ్మ, వై.నాగార్జునరెడ్డి, పి.చెన్నకేశవులు, సి.కాంతమ్మ, సి.సుజాత, కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఖాదర్‌వలీ, బొలెరో వాహనంలో వైస్ ఎంపీపీ పప్పు కృష్ణవేణి, ఎంపీటీసీలు శోభారాణి, వెంకటరమణమ్మ, జయలలిత, పూజారి లక్ష్మీదేవి, సర్పంచులు సుబ్బిరెడ్డి, అనసూయమ్మ వస్తున్నారు. ఈ వాహనాలు ఆస్పత్రి వద్ద ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే మలుపు తిరుగుతుండగా.. అప్పటికే అక్కడ మకాం వేసిన కూటమి నేతలు ఒక్కసారి కార్లపై దాడులు చేశారు. మండలమీట్ జరగడానికి వీల్లేదంటూ అడ్డుకుని భయభ్రాంతులకు గురి చేశారు. కార్లపై పిడిగుద్దులు కురిపించారు. ఓ నాయకుడు రాయితో దాడి చేయడంతో బొలెరో అద్దం పగిలింది. కారులోని ఎంపీటీసీలను హెచ్చరిస్తూ, మహిళా ఎంపీటీసీల పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఎంపీటీసీలు నాగార్జునరెడ్డి, చెన్నకేశవులను కిందికి లాగేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తగా మారడంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు.. కూటమి శ్రేణుల నుంచి ఎంపీటీసీలకు రక్షణ కల్పించి లోపలికి పంపారు. దాడిని నిరసిస్తూ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేస్తూ.. కాలినడకన మండల పరిషత్ కార్యాలయం చేరుకున్నారు. అయినప్పటికీ కూటమి నేతలు మండల పరిషత్ కార్యాలయం లోనికి చొరబడేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లోకి వెళ్లేందుకు అనుమతించలేదు. దీంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. డీఎస్పీ కొండయ్య నాయుడుతోపాటు ములకలచెరువు, బి.కొత్తకోట సీఐలు లక్ష్మణ, జీవన్ గంగనాథ్‌బాబు, పీటీఎం, ములకలచెరువు ఎస్‌ఐలు రవికుమార్, నరసింహుడుతో పాటు 40 మంది పోలీసులు బందోవస్తు నిర్వహించారు.

చంపడానికి ప్రయత్నించారు

మండలమీట్‌కు కారులో వెళ్తున్న తమపై కూటమికి చెందిన నాయకులు దాడి చేసి దురుసుగా ప్రవర్తించడమే కాక చంపడానికి ప్రయత్నించారని పేర్కొంటూ.. ఎంపీటీసీ సభ్యురాలు తొటి జయలలిత పీటీఎం ఎస్‌ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. తమ హక్కులకు భంగం కలిగించడమేకాక హైకోర్టు ఆదేశాల మేరకు సమావేశానికి వెళ్తుండగా.. అందరూ చూస్తుండగానే తమపై దాడి చేశారని, దీనిపై మండలానికి చెందిన పి.చంద్రమోహన్‌రెడ్డి, పి.రాజారెడ్డి, ఎం.సుబ్బయ్య, సికిందర్, బి.మాధవ అలియాస్ మాధవరెడ్డి, పి.శ్రీనివాసులు, కే.చినపరెడ్డిలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని సాలాబాద్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. పరారీలో ఉన్న బద్వేలు పట్టణానికి చెందిన పెరుగు లక్ష్మీనరసయ్య (47) అనే ఎర్రచందనం స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి తీవ్ర అస్వస్థత

తంబళ్లపల్లె : ఇద్దరు వ్యక్తులపై తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. రేణుమాకులపల్లె పంచాయతీ చింపిరెడ్డిగారిపల్లెకు చెందిన పెద్ద మద్దయ్య (64) ద్విచక్రవాహనంలో కన్నెమడుగుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా పెద్ద తేనెటీగలు దాడి చేశాయి. ద్విచక్రవాహనం నుంచి కిందపడిపోయాడు. అదే సమయానికి దిగువగాలిగుట్టపల్లెకు చెందిన జయరామిరెడ్డి అక్కడికి రావడంతో ఒక్కసారి అతన్ని తేనెటీగలు చుట్టుముట్టాయి. ఆయన కేకలు పెడుతూ కన్నెమడుగులోకి పరుగులు తీశారు. స్థానికులు అతనికి దుప్పటి కప్పి నీళ్లు చల్లినా తేనెటీగలు వెళ్లకపోవడంతో.. గడ్డిని తగలపెట్టడంతో వెళ్లిపోయాయి. బాధితులను ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనం అందుబాటులో లేదనడంతో ప్రైవేటు వాహనంలో తంబళ్లపల్లెకు తరలించారు. అక్కడి డాక్టర్లు వారికి ప్రథమ చికిత్సలు చేసి ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అధికారం చేపట్టిన ఆరు నెలలకే విద్యుత్ చార్జీల బాదుడు

- రాష్ట్ర ప్రజలపై రూ.16 వేల కోట్లకు పైగా భారం మోపిన కూటమి సర్కారు
- విద్యుత్ చార్జీలు పెంచమని హామీలు ఇచ్చి, నేడు మాట తప్పిన చంద్రబాబు
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కొనసాగించాలి
- 27న రాయచోటిలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్): ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచమని పదే పదే చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల రూపంలో షాక్ ఇస్తోందన్నారు. ఆరు నెలలకే రాష్ట్ర ప్రజలపై రూ.16 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల భారం మోపిందన్నారు. ఈ ప్రభుత్వంలో ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు అమాంతంగా పెరగడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన ష్యూరిటీ అంతా బోగస్ అని బాదుడు మాత్రం గ్యారెంటీగా ఉందన్నారు. సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై భారం వేయకుండా ప్రభుత్వమే భరించాలని చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించారన్నారు. జగన్ హయాంలో రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని రూ.2 వేల కోట్లకు పైగా నిధులతో డెడికేటెడ్ లైన్లు ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్లను అందించి నాణ్యమైన విద్యుత్‌ను అందించారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు అరకొరగా అందిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో పెన్షన్లు తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయక ప్రజలను మోసగిస్తోందన్నారు.

పోరుబాటను విజయవంతం చేయాలి

విద్యుత్ చార్జీల పెంపును ప్రభుత్వం విరమించాలన్న డిమాండ్‌తో ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వైఎస్సార్‌సీపీ పోరుబాటను విజయవంతం చేయాలని ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు రాయచోటిలోని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్, రామాపురం జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సాదక్‌అలీ, రియాజుర్‌రెహమాన్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, మాజీ కోఆప్షన్ సభ్యుడు జాఫర్‌అలీఖాన్, జీఎండీ ఇర్షాద్, అబుజర్, నవాజ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల అక్రమాలపై విచారణ జరపాలి



ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ

మదనపల్లె : మండలంలోని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్, రిటైర్డ్ డీటీ కలిసి రేషన్ షాపుల్లో చేసిన అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె రూరల్ షాపు నంబర్ 54కు డీలర్ లియాఖత్ ఉండగా.. సీఎస్ డీటీ, రిటైర్డ్ డీటీ కలిసి గతంలో పని చేసిన తహసీల్దార్ సంతకాలు ఫోర్జరీ చేసి కిషోర్‌కు షాప్ కేటాయించారన్నారు. అలాగే మదనపల్లె అర్బన్ షాపు నంబర్ 48 డీలర్ రమాదేవి పదేళ్లుగా కర్నూలులో ఉంటుండగా, డీటీ సహకారంతో మోహన్‌కుమార్ షాపును నడుపుతున్నారన్నారు. రేషన్ డీలర్ల నుంచి కమీషన్ల కోసం రూరల్‌లోని షాపుల కార్డులు అర్బన్‌కు, అర్బన్‌లోని షాపుల కార్డులు రూరల్‌కు మార్చారని ఆరోపించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు కేటాయించిన షాపులు గ్రూపు సభ్యులే నిర్వహించాల్సి ఉండగా, ఇష్టానుసారంగా బినామీల సహాయంతో నిర్వహిస్తున్నారన్నారు. రేషన్ సరుకులు ఇంటింటికీ డెలివరీ చేసేందుకు వినియోగిస్తున్న వాహనాలు మదనపల్లె మండలంలో 35 ఉండాలని, వాటిలో కేవలం 30 వాహనాలు పని చేస్తుంటే, మిగిలిన 5 వాహనాలు డోర్ డెలివరీ చేస్తున్నట్లుగా తప్పుడు బిల్లులు రాసి డ్రా చేస్తున్నారన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త చట్టాలపై న్యాయవాదుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

గాలివీడు : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం గాలివీడు మండలం వెలిగల్లు ప్రాజెక్టు వద్ద ఉమ్మడి జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. అనంతరం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భారత న్యాయవాదుల సంఘం(ఐ.ఎ.ఎల్) ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు సి.సుబ్రమణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి నేర చట్టాలు ప్రజల హక్కులు హరించే విధంగా ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త నేర చట్టాలను తీసుకొచ్చి ప్రజల హక్కులను మరింత మెరుగుపరుస్తామని, సత్వర న్యాయం జరిగేట్లు చూస్తామని చెబుతున్నప్పటికీ బ్రిటీష్ కాలం నాటి చట్టాలే కొత్త చట్టాల కంటే మెరుగ్గా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఐఏఎల్ నాయకులు రెడ్డయ్య, రాజకుమార్‌రాజు, ఆనంద్‌కుమార్, కృష్ణయ్య, చిన్నయ్య, నాగముని, ఖాదర్‌బాషా, సిద్దయ్య, హ్యూమయున్ బాషా, మహమ్మద్ బేగ్, నిరంజన్, హిదాయతుల్లా, బీవీ రమణ, ఆదిరెడ్డి నాయక్, రవిశంకర్, ఎస్‌ఎండీ రమణ, వరలక్ష్మి, కేఈ రమణ, ఆర్‌డీ ఆనంద్, ఉత్తేజ్ కుమార్, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంతో ఉజ్వల భవిత



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

వీరబల్లి : కిశోర వికాసంతో బాలికలకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాసంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర వికాసం అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. మొదటి విడతలో రెండు లక్షల మందికి చైతన్యం కల్పించామని, రెండో విడతలో ప్రతి వ్యక్తికి చైతన్యం కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు, లైగింక హింస, టీనేజ్ ప్రెగ్నెన్సీ లాంటి అనేక సమస్యలను బాలికలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రతి గ్రామంలో ఇలాంటి సమస్యలు లేకుండా చేయాలంటే.. కిశోర వికాస గ్రూపులను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరస్వతమ్మ, లలితమ్మ, ఐసీడీఎస్ ఎక్స్టెన్షన్ అధికారి రాజేశ్వరీ, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి చెట్ల నరికివేత

– టీడీపీ నాయకుల దాష్టీకం



నరికివేతకు గురైన మామిడి చెట్లు

పెనగలూరు : మండలంలోని వెలగచర్లలో సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన నలుగురు టీడీపీ నాయకులు 300 మామిడి చెట్లను నరికివేసినట్లు దాది శ్రీనివాసులు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వెలగచర్ల రెవెన్యూ పొలం సర్వే నంబరు 678లో 5 ఎకరాల పొలాన్ని నాలుగేళ్ల నుంచి సాగు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మామిడి చెట్లను మూడేళ్ల క్రితం నాటినట్లు తెలిపారు. ప్రస్తుతం మామిడి చెట్లతోపాటు అరటి చెట్లు కూడా పొలంలో ఉన్నాయన్నారు. మామిడి చెట్లను మాత్రమే నరికివేసి అరటి చెట్లను వదిలి వేశారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాన్నారు. తనకు జరిగిన నష్టానికి టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు బతుకు దెరువైనటువంటి మామిడి చెట్లను నరికి తనను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పెట్టారని ఆయన వాపోయారు.

తలకు గాయమై మహిళ మృతి

సుండుపల్లె : తలకు గాయమైన బెస్తాల నాగమునెమ్మ (50) మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని బెస్తపల్లి యల్లంపల్లికి చెందిన నాగమునెమ్మ రోజూ ఉదయాన్నే దేవాలయాలకు వెళ్లే అలవాటు ఉందని, మంగళవారం ఉదయాన్నే తిమ్మసముద్రం గ్రామంలోని ఓబులేశుని కొండకు వెళ్లేదారిలో పడిపోయి తలకు గాయమై మృతి చెందినట్లు గుర్తించామని ఆమె కుమారుడు బెస్తాల సతీష్ నాయుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నాగమునెమ్మకు గుండె జబ్బు, బీపీ వంటి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు పోలీసులకు సతీష్ నాయుడు ఫిర్యాదు చేయడంతో, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు పేర్కొన్నారు.

డిజిటల్ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి టౌన్ : వినియోగదారులు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం అన్నారు. మంగళవారం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం -2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2020 నవంబర్ 6వ తేదీన అన్ని న్యాయస్థానాల్లో వర్చువల్ పద్ధతి అమలులోకి వచ్చిందన్నారు. ఈ పద్ధతి ద్వారా కూడా వినియోగదారుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ : ద్విచక్రవాహనంలో వస్తుండగా కుక్క అడ్డురావడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలం 150 మైలు వద్ద మంగళవారం జరిగింది. రామసముద్రం మండలం మినికి గ్రామానికి చెందిన శంకర్(45), గంగాధర్(35) ద్విచక్రవాహనంలో కంటి పరీక్షల నిమిత్తం మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలో 150 మైలు వద్ద కుక్క అడ్డురావడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో శంకర్‌కు తలకు బలమైన గాయం తగిలింది. గంగాధర్ కాలుకు గాయమైంది. స్థానికులు గమనించి 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. శంకర్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని కాపాడిన వైద్యుడు

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడివున్న ఒక స్టూడెంట్‌ను అటు వైపు వెళ్తున్న ఒక ప్రభుత్వ వైద్యుడు కాపాడిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలం సరిహద్దులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కోనేటివారిపల్లెకు చెందిన అనిల్(19) తన బైక్‌లో ఇంటికి వెళ్తుండగా మండల సరిహద్దులోని ఈదుల వంక మలుపు వద్ద కదిరివైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బి.కొత్తకోట ప్రభుత్వ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటరామయ్య సొంత పనుల మీద కదిరి వెళ్తుండగా స్టూడెంట్‌ను చూసి సీపీఆర్ చేసి కోలుకునేలా చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు 108 సాయంతో తనకల్లు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. లారీలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రాష్ట్రంలో బూటకపు హామీ పాలన


- 27న పోరుబాటను విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట : రాష్ట్రంలో బూటకపు హామీ పాలన కొనసాగుతోందని, ఇప్పటికే ప్రజలు బాబు పాలనపై అసంతృప్తితో ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆకేపాటి భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాదుడే బాదుడు సీఎంగా చంద్రబాబు నాయుడు చరిత్రలో నిలిచిపోయారన్నారు. అన్నివర్గాలను మోసం చేసే విధంగా కూటమి పాలన కొనసాగిస్తున్నారన్నారు. మంచి ప్రభుత్వం కాదని మోసపూరిత ప్రభుత్వమనేది ప్రజలు గుర్తించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చేందుకు సాధ్యం కాని హామీలను గుప్పించారన్నారు. ఇప్పుడు వాటిని చూస్తుంటే భయంవేస్తోందని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా చెప్పడంతోనే జనంలో అనుమానాలు వ్యక్తమయ్యాయన్నారు. సూపర్‌సిక్స్‌తో జనాన్ని బోల్తా కొట్టించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో మూడుసార్లు కరెంటు చార్జీలను పెంచారన్నారు. దళితుల వ్యతిరేక ప్రభుత్వం అని చెప్పడానికి ఎస్సీ కాలనీలో కరెంటు కనెక్షన్లు తొలగించడమే నిదర్శనమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 27న కరెంటు చార్జీల పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ర్యాలీలు నిర్వహించాలన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఎదుట ధర్నాలు చేపట్టాలన్నారు. కరెంటు బిల్లుల బాదుడుతో ఇబ్బందులు పడుతున్న ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలోవైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జె.కృష్ణారావుయాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు పాపినేని విశ్వనాథరెడ్డి, దొడ్డిపల్లె భాస్కర్‌రాజు, సౌమిత్రి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, రమేష్ నాయుడు, దండు గోపి, జీవీ సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, మసూద్, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్, మహిళానేతలు రక్కాసి శ్రీవాణి, మిరయాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలపై నివేదిక పంపుతాం



జేసీకి సమస్యను వివరిస్తున్న ఆర్‌డీఓ

ఒంటిమిట్ట : సోమశిల ముంపు ప్రాంతాలపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపుతామని వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. మంగళవారం ముంపు ప్రాంతాలైన మండల పరిధిలోని తప్పెటవారిపల్లె, పెన్నపేరూరు గ్రామాలను సోమశిల జలాశయ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె ముంపు గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఈ గ్రామాలకు సోమశిల వెనుక జలాల వల్ల కలిగే నష్టాన్ని తాను గ్రహించానని, త్వరలో జరగబోయే ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో నివేదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు, కడప ఆర్‌డీఓ జాన్ ఇర్విన్, సోమశిల జలాశయం ఎస్‌ఈ రమణారెడ్డి, ఈఈ రమణారెడ్డి, ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.